పేదల ఇళ్ల మాటున వైసీపీ హయాంలో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఇళ్ల స్థలాల గుర్తింపు నుంచి గృహ నిర్మాణం వరకూ భారీ అక్రమాలు జరిగాయి. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచి పెట్టారు తప్ప పేదలకు గూడు మాత్రం నిర్మించలేకపోయారు. ఇష్టటికే భారీ ధరకు స్థలాల కొనుగోలు, లెవలింగ్ పేరుతో విచ్చలవిడి దోపిడీ, ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు చెల్లించడం.. వంటి అక్రమాలపై విచారణలు పూర్తయ్యాయి. రూ.వందల కోట్ల దోపిడీ జరిగినట్లు తేలింది. ఈ కోవలోనే లేఅవుట్లలోనైనా ఇళ్ల స్థలాలను పేదలకు ఇచ్చారా!? లేదా!? అవి కూడా పెద్దలకు దోచి పెట్టారా!? తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వంలో పట్టాలు అందుకున్న వారి అర్హతపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రంగంలోకి దిగిన అధికారుల బృందం ప్రతీది క్షుణ్ణంగా అధ్యయనం చేస్తోంది.



పేదల లేఅవుట్లలో పెద్దలు ఎవరు!?

- అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం
- విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- రంగంలోకి దిగిన అధికారుల బృందం
- ప్రతి లేఅవుట్ జాబితా పరిశీలన

నెల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తా మంటూ వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 1,170 లేఅవుట్లు వేయగా ప్రస్తుత జిల్లాలో 852 లేఅవుట్లు వేశారు. ఇందుకు 2,832 ఎకరాల భూమిని ఉపయోగించారు. ఇక్కడ వెయ్యి ఎకరాలకు పైగా భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు. ఇలా వేసిన లేఅవు ట్లలో 1.35 లక్షల మందికి పట్టాలు ఇచ్చినట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. వీటిని కన్వేయన్స్ డీడ్ రూపంలో అందించగా చాలా మంది తీసుకునేందుకు ముందుకు రాలేదు. అయితే కొందరికి పట్టాలు ఇచ్చినా వారి ప్లాట్లు ఎక్కడన్నది ఇప్పటికీ తెలియదు. ప్రతి లేఅవుట్‌లోనూ అర్హుల గుర్తింపులో భారీ అవకతవకలు జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. నిజమైన అర్హులను పక్కనపెట్టి వైసీపీ నేతలు, కార్యకర్త లను ఈ జాబితాలో చేర్చారు. కొన్ని విలువైన లేఅవుట్లలో చాలా ప్లాట్లను వైసీపీ నాయకులు తీసుకొని ఆ వెంటనే వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 98,781 మందికి ఈ లేఅవుట్లలో ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికీ 50 వేలకు పైగా ఇళ్లు పునాదుల దశ దాటకపోవడం గమనార్హం. జిల్లాలో ప్రైవేటు భూములు కొనుగోలు చేసేందుకు రూ.210 కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వ భూముల విలువ మరో రూ.200 కోట్లు పైన ఉంటుంది. ఇక ఈ లేఅవుట్లను చదును చేసేందుకు రూ.260 కోట్లు ఖర్చు చేశారు లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించేందుకు ఇప్పటివరకూ సుమారు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. ఈ లెక్కన చూస్తే జగనన్న కాలనీలకు సుమారు రూ.1700 కోట్ల వరకూ ప్రజా ధనాన్ని ఖర్చు చేసినట్లు అర్థమవుతోంది. మరి అంత ఖర్చు చేసి ఎంతమంది పేదలకు గూడు కల్పించారంటే చెప్పలేని పరిస్థితి.

వెలుగులోకి వస్తున్న అక్రమాలు

ఈ నేపథ్యంలో పేదల కాలనీల్లో పట్టాలు పొందిన అనర్హులను ఏరివేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన వ్యక్తులు నిజంగా అర్హులా.. కాదా..? అన్నది తేల్చాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బృందాలు ఏర్పడి విచారణ చేస్తున్నారు. ఈ విచారణకు సంబంధించి కొన్ని ప్రశ్నలను రూపొందించారు. సదరు పట్టాదారుడికి ఇది వరకే సొంతిల్లు ఉందా..? వారిలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారా..? వారికి నిబంధనలకు మించి ఆస్తులు ఉన్నాయా..? ఇదివరకు ఇతర హౌసింగ్ పథకాల్లో లబ్ధిపొంది ఉన్నారా..? వంటి ప్రశ్నలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం విచారణ వేగంగా జరుగుతోంది. చాలా చోట్ల అక్రమాలు బయట పడుతున్నాయి. ఇది పూర్తయ్యాక అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయి..? ఎంత మంది అనర్హులకు పట్టాలు కట్టబెట్టారు..? అన్నది తేలుతుంది. ఈ వ్యవహారంపై జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కరరావును వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ లేఅవుట్లలో లబ్ధిదారుల అర్హతపై విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. విచారణ పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక పంపుతామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి దుర్గా దొరబాబు, పక్కన కార్యవర్గ సభ్యులు

పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్లు కుదించాలి

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్లను కుదించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం తీర్మానించింది. ఆ సంఘం సమావేశంలో నెల్లూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జరిగింది. నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం కార్యదర్శుల ను 6 గ్రేడ్లుగా విభజించారని, దానిని మూడుకు కుదించాలని డిమాండ్ చేశారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి పోస్టు పేరు మార్చాలని, కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించాలని కోరారు. కాగా, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముషీధర్, ఉపాధ్యక్షురాలిగా పద్మజను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి దుర్గా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

- చికెన్ షాపులు వెలవెల



కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధిసోకి మృత్యువాత పడుతుండటంతో చికెన్ కొనుగోలుకు ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఆదివారం సెలవురోజున చికెన్ షాపులన్నీ వెలవెలబోయాయి. నెల్లూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో షాపులన్నీ బోసిపోయాయి. ఉదయగిరిలోని ప్రధాన చికెన్ దుకాణాల్లో రోజుకు 500 కిలోల మాంసం విక్రయిస్తుండగా, కనీసం 100 కిలోలు కూడా అమ్ముడు పోలేదని వ్యాపారులు వాపోయారు. చికెన్‌కు దూరమైన ప్రజలు చేపలు, మటన్ కొనుగోళ్లకు ఎగబడ్డారు. అరకిలో మటన్ తీసుకునేందుకు గంటల సేపు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

మామిడీలా!

- ఓ వైపు మంచు.. మరోవైపు తెగుళ్ల బెడద
- మాడిపోతున్న పూత.. రాలిపోతున్న పిందెలు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో సాగుదారులు

మామాడి సాగుదారు ఈసారి కూడా డీలా పడుతున్నాడు. గత వైసీపీ ప్రభుత్వ సహాయ నిరాకరణ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతుకు ఆదిలోనే మంచు తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఓ వైపు పొగ మంచు, మరోవైపు తెగుళ్లు ప్రభావంతో మామిడి చెట్లలోని పూత మాడిపోతోంది. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సంగం/ఉదయగిరి, ఆంధ్రజ్యోతి

జిల్లాలోని ఉదయగిరి, కందుకూరు, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో విస్తారంగా మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకు మామిడి చెట్లలో పూత వస్తుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఆలస్యంగా పూత వస్తోంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెల సగం పూర్తయినా మంచు కురుస్తూనే ఉంది. ఇటీవల వారం రోజుల నుంచి పొగ, గూడ మంచు మరీ ఎక్కువయ్యింది. ఈ మంచు కారణంగా పూత మాడిపోతోంది. దీనికితోడు తేనె మంచు పురుగు సోకడంతో ఉన్న పూత కూడా దెబ్బతిన్నది. మంచు ఇలాగే కొనసాగితే మామిడిపై ఆశలు వదులు కోవల్సిందేనని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాపు నిలబడితే చాలు..

ఈ సంవత్సరం ఆలస్యంగానైనా పూత బాగా వస్తుందని మామిడి రైతులు ఆశ పడ్డారు. కానీ మంచు దెబ్బకు పూత మాడిపోగా, పిందె దశలో ఉన్న కాయలు కూడా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కాపు నిలబడితే చాలని భావిస్తున్నారు. కానీ వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి ఎంతవరకు వస్తుందనే అంచనా వేయలేకపోతున్నారు. మంచు దెబ్బకు కాయ సైజు తగ్గడంతో మార్కెట్‌లో ధర పలకదని, ముందస్తు కొనుగోలు చేసే వ్యాపారులు కూడా వెనకడుగు వేస్తున్నారని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 4 టన్నుల దిగుబడి వచ్చి టన్ను రూ.20 వేలకు పైగా ధర పలికితే పెట్టుబడి బ్యాంకుల రుణాల వడ్డీలకే సరిపోతుందంటున్నారు. మంచు దెబ్బతో తెగుళ్ల నివారణకు పిచికారీ మందుల కోసం ఎకరానికి రూ.60 వేల వరకు ఖర్చు అవుతోంది.

పెరుగుతున్న సాగు ఖర్చులు

ఒక ఎకరా విస్తీర్ణంలో మామిడి మొక్కలు తెచ్చేందుకు, దుక్కులు, వాటిని వేసే కూలీలు, ఇతర పనులకు రూ.50వేల వరకు పెట్టుబడి అవుతోంది. వీటితో పాటు రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కూలీలు, రవాణా తదితర ఖర్చులు అదనంగా ఉంటాయి. పూత దశలో నీరు పెట్టడం, పూత నిలిచేందుకు పలుమార్లు మందులు పిచికారీ చేయడం, యాజమాన్య పద్ధతులు పాటించక పోవడంతో పంట చేతికి రావడంలేదు. వచ్చినా అరకొరగా దిగుబడి వస్తుండటంతో పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి. ఒకవేళ దిగుబడులు వచ్చినా ఆశించిన ధరల లేకపోతే నష్టపోతారు. చేసేదిలేక దళారులు, వ్యాపారులు చెప్పిన ధరలకే మామిడి కాయలు అమ్ముకోవాల్సి దుస్థితి వస్తోంది. ఇప్పటికైనా ఉద్యానశాఖ అధికారులు స్పందించి మామిడి రైతులకు పంట సాగుతోపాటు తెగుళ్ల నివారణ, అధిక దిగుబడికి సూచనలు, సలహాలు అందజేయాలి. అలాగే మార్కెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సాగుదారులు కోరుతున్నారు.



సంగం : చెట్లపైనే మాడిపోతున్న పూత



పూలే విగ్రహాలను ఆవిష్కరించిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పక్కన రాష్ట్ర మంత్రి నారాయణ, అబ్దుల్ అజీజ్ తదితరులు

జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయులు

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయులని, ప్రతి ఒక్కరూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని పూలే అడుగుజాడల్లో నడవాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. నెల్లూరులోని పప్పులవీధిలో ఉన్న ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు నగరపాలక ఉన్నత పాఠశాలలో బండారు ఈశ్వరమ్మ పొదుపు గ్రూపు సౌజన్యంతో జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను దత్తాత్రేయ ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు పూలే ఎంతో కృషి చేయడంతోపాటు విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని వెనుకబడిన వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు కృషి చేస్తారని కొనియాడారు. పూలే సతీమణి సావిత్రాబాయికి విద్య నేర్పించడంతో పాటు ఒక సామాజిక సంఘసంస్కర్తగా తీర్చిదిద్దారని అన్నారు. ఆమెద్వారా మహిళల్లో విద్యపట్ల చైతన్యం కలిగించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ పూలే దంపతులు సమాజానికి అందించిన సేవలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆర్డీఓ అనూష, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

కందలపాడు మైనింగ్ అనుమతులు రద్దు చేయండి

- మంత్రి లోకేష్‌కు గ్రామస్థుల విజ్ఞప్తి
- మనుబోలు, వెంకటాచలం వద్ద యువనేతకు ఘన స్వాగతం
- తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- పలు సమస్యలపై అర్జీల స్వీకరణ



మనుబోలు క్రాస్ రోడ్డు వద్ద కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న లోకేష్

వెంకటాచలం/మనుబోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం కందలపాడు పరిసరాల్లో మైనింగ్ కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేసి సాగులో ఉన్న తమ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆ గ్రామస్థులు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఉదయం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న లోకేష్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గాన వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు ప్రత్యేక కాన్వాయ్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో మనుబోలు, వెంకటాచలం జాతీయ రహదారిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద నాయకులు, అభిమానులకు లోకేష్ తన కారు బయట నిలబడి అభివాదం చేశారు. ఈ సందర్భంగా కందలపాడు మైనింగ్ అనుమతులపై గ్రామస్థులు లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మరికొందరు అర్జీలు ఇవ్వగా వాటిని స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.


- అంతకముందు లోకేష్‌ను చూసేందుకు మనుబోలు క్రాస్ రోడ్డు వద్దకు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ ఇతర నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. లోకేష్ కాన్వాయ్ రాగానే కాబోయే సీఎం అంటూ నినాదాలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి తదితరులు లోకేష్‌కు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్ కుమార్, ముంగర విజయ భాస్కర్‌రెడ్డి, చెల్లగిరి ప్రసాద్, శివుడు రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి.. ఆర్థికాభివృద్ధి!

- ఆ దిశగా 'మెప్మా' అడుగులు
- ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి

- వివరాలు 7లో





పోలీసు మెడకు 'అనంతార్థ' స్కాం!

- సూత్ర, పాత్రధారులూ కానిస్టేబుళ్లే!
- సమగ్ర విచారణకు జంకుతున్న వైనం
- ఉన్నతాధికారుల తీరుపై అసహనం
- కేసు నమోదైనా సుభాన్ ఖాతాలోకి నగదు?

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో అనంతార్థ మనీస్కాం వ్యవహారం పోలీసుల మెడకు చుట్టుకుంటోంది. సూత్ర, పాత్రధారులు ఆ శాఖ సిబ్బందే ఉండటంతో ఉన్నతాధికారులకు తల నొప్పిగా మారిం ది. పూర్తిస్థాయిలో విచారిస్తే తమ పరు వు ఎక్కడ పోతుందో నని భావిస్తూ నగదు రికవరీపైనే ఫోకస్ పెట్టారన్న విమర్శలు ఉన్నాయి. గుంటూరుకు చెందిన మహబూబ్ సుభాన్ 2021 నుంచి కావలిలో ఈ స్కాం నిర్వహిస్తుంటే దాన్ని కట్టడి చేయాల్సిన పోలీసులు ఆయనకు రక్షణగా నిలవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్, విజిలెన్స్ నిఘా విభాగా లున్నా సాక్షాత్తు ఎమ్మెల్యే వెంకటక్రిష్ణా రెడ్డి ఫిర్యాదు చేసే వరకు పట్టించుకోక పోవటంతో ప్రజలకు పోలీసులపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ స్కాంలో కొందరు పోలీస్‌లు లబ్ధి పొందగా మరికొందరు తీవ్రంగా నష్టపోయారు.

ఆఫర్లు, కమీషన్లు

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో 'అనంతార్థ' నిర్వాహకులు కొందరు యువకులకు శిక్షణ ఇచ్చి చివరకు వారినే ఏజెంట్లుగా నియమించుకున్నారు. డబ్బులు కట్టే వారి కి రకరకాల ఆఫర్లు ఇచ్చారు. పాచి పని చేసు కునే వారి మొదలు ఉద్యోగుల వరకు భారీగా కలెక్షన్లు వసూలు చేసినట్లు విచారణలో తెలుస్తోంది. 2021 నుంచి డబ్బులు కట్టించే వారికి కూడా కమీషన్లు వస్తుండటంతో ఎక్కడా నిజాలు వెలుగులోకి రాలేదు.

నగదు జమవుతూనే ఉంది!

'అనంతార్థ' నిర్వాహకుడు సుభాన్‌పై పోలీసు కేసు నమోదయినా ఆయన బ్యాంకు ఖాతాలో మాత్రం ఇప్పటికీ నగదు జమ అవుతూనే ఉంది. ఓ కానిస్టేబుల్ తన ప్లాటు అమ్మగా వచ్చిన నగదును ఈ స్కాంలోని ఓ సూత్రధారి అయిన మరో కానిస్టేబుల్ ద్వారా ఈ నెలలో ఏజెంట్ ఖాతాలో జమ చేయించినట్లు తెలిసింది. అయితే ఆ డబ్బులు సుభాన్ ఖాతాలో జమకాలేదని సమాచారం. అప్పటికే సుభాన్ ఆర్థిక లావాదేవీలన్నీ నిలిచిపోవటంతో ఆ డబ్బులు ఎవరి ఖాతాలో వేశారో బయటపెట్టడం లేదు.

- అలాగే ఏజంట్‌గా ఉన్న ఒక మెకానిక్ కూడా ఇటీవల కొంతడబ్బును ఒక వ్యక్తి ద్వారా సుభాన్ అకౌంట్‌కు వేశారు. ప్రజలు ఇలా డబ్బులు కడుతుంటే తానేమి చేయాలని సుభాన్ పోలీసులకు చెప్పిన ట్లు తెలిసింది. ముసునూరు సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ ఆ ప్రాంతంలోని గిరిజనులతో చాలా డబ్బులు కట్టించినట్లు తెలుస్తోంది.

పోలీసులకు తలనొప్పిగా..

స్కాంలో పాత్ర, సూత్రధారులు, ఏజెంట్లు పోలీసులే ఉండటంతో దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు పోలీసు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారుతోంది. లోతైన విచారణ జరిపితే తమ శాఖ ఉద్యోగులు ఇబ్బందులు పడతారేనని కాబట్టి బాధ్యులపై చర్యలు పక్కన పెట్టి వీలైనంత వరకు నగదు రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలనే కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, నిందితుడు మహబూబ్ సుభాన్‌పై కేసు నమోదైన తర్వాత కూడా డిపాజిట్లు వస్తున్నాయంటే ఏజెంట్లు భయంలేకుండా ఎంత బరి తెగించి ఉన్నారో అర్థం అవుతోంది.

తెలంగాణా బాధితులు కావలికి..

సుభాన్ తెలంగాణాలో కూడా సుమారు రూ.200 కోట్ల వరకు స్కాం చేసి తప్పించుకుని తిరుగుతున్నారని ఆ రాష్ట్రానికి చెందిన పలువురు బాధితులు వాపోయారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన బాధితులు అక్కడ ఎమ్మెల్యేతో కావలి ఎమ్మెల్యేకు ఫోన్‌లో మాట్లాడించి కావలికి వచ్చారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని కలిసి అక్కడ ఆయన చేసిన మోసాలను వివరిం చారు. అనంతరం సుభాన్ కార్యాలయం వద్దకు వెళ్లి కొంతసేపు ఉండి వెళ్లిపోయారు.

కమీషన్లు కూడా స్కీంలోకే..

లబ్ధి పొందిన వారికన్నా నష్టపోయిన వారే అధికంగా ఉన్నారు. నాలుగేళ్లుగా కట్టిన వారికి అధిక మొత్తంలో రీ పేమెంట్ పొందారు. పెట్టుబడిదారులు, కమీషన్ ఏజెంట్లు అందరూ కాగితాల రూపంలో సంపాదన లెక్కలు వేసుకోవటం తప్ప వారి చేతికి పెద్దగా వచ్చింది లేదు.

న్యూస్ బాక్స్



శివరాత్రి ఉత్సవాలకు వేమిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ అర్చకులు

నిత్యాన్నదానానికి రూ. 5లక్షల విరాళం

సీతారామపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మండలంలోని శ్రీఇష్టకామేశ్వరిదేవి సమేత ఘటిక సిద్ధేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.5లక్షల విరాళం అందజేశారు. ఆలయ అర్చకులు చిన్నకాశయ్య, సుబ్బరాయుడు ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో వారిని కలిసి, శివరాత్రి ఉత్సవాలను రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీపీఆర్ దంపతులు రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. ఏటా శివరాత్రి ఉత్సవాలకు ఘటిక సిద్ధేశ్వరంలో వేమిరెడ్డి దంపతులు వసతులు కల్పిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం 2017లో వాటర్‌ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

● వివాహ రిసెప్షన్‌కు వీపీఆర్ దంపతులు

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మనుమడి వివాహ రిసెప్షన్ ఆదివారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో జరిగింది. ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి దంపతులు హాజరయ్యారు. వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సోమశిలలో 62.902 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 1,110 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 62.902 టీఎంసీల నిల్వ ఉందని, దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

19 నుంచి టెన్త్ పరీక్షలపై సమీక్ష

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ఈనెల 19, 20 తేదీల్లో డివిజన్ స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 19వతేదీన కందుకూరు, కావలి డివిజన్లకు, 20న ఆత్మకూరు, నెల్లూరు డివిజన్లకు ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు అందరూ కచ్చితంగా పాల్గొనాలన్నారు. సమీక్షలకు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, జిల్లా నోడల్ అధికారి రవీంద్ర రెడ్డి హాజరవుతారని తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

మర్రిపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైంది. చీర్ల ఇందిరమ్మకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ అవుతుండగా పైనుంచి ఆకు రాలి పొగ గొట్టంపై పడి ప్రమాదం జరిగింది. ఆత్మకూరు నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు అదుపు చేసే సమయానికి పూర్తిగా బ్యారన్‌లోని పొగాకు కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	216
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8127
వెండి కిలో ధర	రూ. 98,500
వెండి ఒక గ్రాము	రూ.101.50

ప్రాక్టికల్స్‌కు 5,426 మంది హాజరు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఆదివారం కొనసాగాయి. జిల్లా వ్యాప్తం గా ఉదయం సెషన్‌లో 3,068 మంది విద్యార్థులకు గాను 2,988 మంది హాజరుకాగా 80 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం సెషన్‌లో 2,494 మందికి 2,438 మంది హాజరు కాగా 56 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 5,426 మంది విద్యార్థులు ఆదివారం ప్రాక్టికల్స్‌కు హాజరయ్యారు. ఆర్ఐవో శ్రీనివాసులు 5 కేంద్రాలను, డీవీఈవో 4, డీఈసీ సభ్యులు 5, ఫ్లైయింగ్ స్క్వాడ్ 11 కేంద్రాలను పరిశీలించారు. కాగా, ఆదివారం నాటికి 15 ఒకేషన ల్, 64 జనరల్ కేంద్రాల్లో కలిసి మొత్తం 79 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ తొలి విడత పూర్తయ్యాయని ఆర్ఐవో తెలిపారు. ప్రాక్టికల్స్ సజావుగా సాగుతున్నాయని, అపోహలు, ఆరోపణలు నమ్మవద్దన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రెండో విడత ప్రాక్టికల్స్ 19 నాటికి పూర్తవుతాయన్నారు.



ప్రయోగ పరీక్షలకు హాజరైన విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

దెబ్బతిన్న రైయిలింగ్‌తో ప్రమాదం

సంగం పాత ఆనకట్ట దక్షిణం వైపు నెల్లూరు చెరువు కాలువ పాత హెడ్ రెగ్యులేటర్‌కు ఉన్న రైయిలింగ్ దెబ్బతిని, ప్రమాదం పొంచి ఉంది. సంగం నుంచి ఈ పాత హెడ్‌రెగ్యులేటర్ వంతెనపై నుంచే సూరాయపాళెం, నేదురుమల్లికి ప్రయాణికులు, వాహనదారులు వెళ్లాలి. కమ్ములు తుప్పుపట్టి శిథిలమై పూర్తిగా దెబ్బతిన్నాయి. అంతేకాక హెడ్‌రెగ్యులేటర్ రాడ్ల వద్ద సందుల్లో ఐరన్ షీట్‌లు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు అందులో ఇరుక్కుంటున్నాయి. ప్రయాణికులు ఆదమరిస్తే 20 అడుగుల లోతున్న కాలువలో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి రైయిలింగ్‌ను, ఐరన్ షీట్‌ను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



ఉపాధి.. ఆర్థికాభివృద్ధి!

● ఆ దిశగా 'మెప్మా' అడుగులు ● పెద్ద సంఖ్యలో సంఘాల ఏర్పాటు ● సర్వీస్ ప్రొవైడర్లు, మెప్మా బజార్లతో ప్రోత్సాహం

● ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లాలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు పలు రంగాల్లో ఉపాధి చూపేందుకు కృషి చేస్తోంది. అందుకు తగ్గట్లు అనేక పథ కాలు ప్రవేశపెట్టింది. ఆయా పథకాల అమలుకు మెప్మా పనిచేస్తోంది. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళల ను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో పట్టణ జనాభా, సంఘ సభ్యుల ఆర్థిక, ఉపాధి, సామాజికాంశాల డేటా సేకరించి భద్రపరిచింది. పొదుపు సంఘాలను వాటి నిర్వహణ ప్రాతిపదిక న ఏబీసీడీలుగా గ్రేడింగ్ చేస్తోంది.

● లక్ష్యానికి మించి సంఘాల ఏర్పాటు

2024 - 25 ఆర్థిక సంవత్సరంలో 176 పొదుపు సంఘాలను ఏర్పాటు చే యాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, అంతకు మించి ఇప్పటి వరకు 191 సం ఘాలు ఏర్పాటు చేశారు. నిస్సహాయ వర్గాల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు వంద రోజులు ప్రణాళిక వేసుకున్నారు. దాని ప్రకారం కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని నెల్లూరు నగర పాలక సంస్థ, నాలుగు మున్సిపాలిటీల్లో 13 పట్టణ సమాఖ్యలు, 518 స్లం సమాఖ్యలు ఉన్నాయి. 14,991 మెప్మా పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిలో 1,49,319 మంది సభ్యులున్నారు. రుణాల మంజూరులోనూ మెప్మా వేగంగా పనిచేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్స రంలో బ్యాంకు లింకేజీ ద్వారా 1600 పొదుపు సంఘాలకు రూ.160 కోట్లు మంజూరు చేసింది. స్వయం ఉపాధి పథకం కింద వ్యక్తిగత రుణాల కేటగిరిలో 370 మందికి సంబంధించి రూ.36 కోట్లు, గ్రూప్ ఎంటర్‌ప్రైజెస్ కింద 8 గ్రూపులకు రూ.32లక్షలు రుణాలు జారీ చేసింది.

వీధి విక్రయదారుల కోసం..

ప్రధానమంత్రి వీధి విక్రేతల ఆత్మ నిర్భర్ నిధి పథకం కింద పెద్ద ఎత్తు న జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకం అమలు జరుగుతోంది. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) యూనిట్స్ ఏర్పాటు కోసం సీడ్ కాపిటల్ రూ.40వేలు సంబంధిత స్లం సమాఖ్యకు మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారురాలికి ఆరు శాతం సాధా రణ వడ్డీ వంతున రుణం మంజూరు చేస్తున్నారు. 2024 - 25 ఆర్థిక సంవ త్సరంలో పీఎంఎఫ్ఎంఈ ద్వారా యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపా దనలు పంపారు. భారత ప్రభుత్వ వాణిజ్య విభాగం ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్డీపీ) ద్వారా ఈ-కామర్స్ ప్లాట్ ఫాంను తీసుకువచ్చారు.



పొదుపు సంఘాల మహిళలు

● సర్వీస్ ప్రొవైడర్స్..

ముఖ్యమంత్రి చంద్ర బాబు పట్టణ ప్రాంతాల్లో సర్వీస్ ప్రొవైడర్స్‌ను తీసు కొచ్చారు. ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త అనే భావనలో భాగంగా దీనిని ప్రవేశపెట్టారు. వివిధ వృత్తు లపై శిక్షణ ఉన్న వారిని గుర్తిం చి మెప్మా హోమ్ ట్రయాంగిల్ సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేశారు. తద్వారా వారికి ఉపాధి కలుగనుంది.

పట్టణ పేదరిక నిర్మూలనే లక్ష్యం



జిల్లాలో పట్టణ పేదరిక నిర్మూలన కోసం పని చేస్తు న్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల పథ కాలను అర్హులకు అందించేం దుకు కృషి చేస్తు న్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలకు చేరువలో ఉన్నాం.

- రాధమ్మ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

● మెప్మా బజార్ల ఏర్పాటు

పొదుపు మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు మెప్మా బజా ర్లు ఏర్పాటు చేస్తున్నారు. స్వయం సహాయక సంఘం సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా మెప్మా ద్వారా స్టాళ్లు ఏర్పాటు చేయను న్నారు. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 60 మెప్మా బజార్లు ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇప్పటి వరకు 52 బజార్లను ఏర్పాటు చేశారు.



లారీ క్యాబిన్‌లోకి దూసుకొచ్చిన చెట్టు కొమ్మ

చెట్టును ఢీకొన్న లారీ

● క్యాబిన్‌లో ఇరుక్కుని క్లీనర్ మృతి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి రోడ్డుకు పక్కనే ఉన్న చెట్టు తగిలిన ప్రమాదంలో లారీలోని క్లీనర్ అక్కడిక్కడే మరణించాడు. ఈ ఘటన ఆదివారం నెల్లూరు రూరల్ కాకుపల్లి వద్ద జరిగింది. స్థానికులు, రూరల్ పోలీసుల సమాచారం మేరకు.. ముత్తుకూరు మండలంలోని థర్మల్ కర్మాగారాల్లో బూడిద లోడింగ్ చేసుకున్న లారీ నెల్లూరు వైపు బయల్దేరింది. కాకుపల్లి వినాయక ఆలయం వద్దకు వచ్చేరికి ముందు వెళ్తున్న లారీని అధిగమించే ప్రయత్నంలో రోడ్డుకు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఆ చెట్టు కొమ్మ లారీ క్యాబిన్‌లోకి దూసుకు వచ్చింది. దీని కింద ఇరుక్కుపోయిన క్లీనర్ కుసులేందర్ (21) అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న చెట్టు కొమ్మను తొలగించేందుకు గంటల సమయం పాటు శ్రమించారు. దీంతో ముత్తుకూరు రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మరణించిన క్లీనర్ మధ్యప్రదేశ్ రాష్ట్రం తెహ్‌డోల్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ గుంజి వేణు తెలిపారు. కాగా, మరణించిన వ్యక్తి లారీ డ్రైవర్ దీవక్‌కు సొంత తమ్ముడు కావడం గమనార్హం.

9 నుంచి రంగడి తిరునాళ్ల

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి నెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయని ఆ ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమ పనులు ప్రారంభిస్తూ సోమవారం ఉదయం 9 గంటలకు గుంజ ప్రతిష్ఠ చేస్తున్నామని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం

● ఓ వైసీపీ కార్యకర్త నిర్వాహకం
● ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారం
● మంత్రి ఆనం హెచ్చరికతో స్పందించిన అధికారులు
● ఎట్టకేలకు గోడ తొలగింపు

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటోవార్డులో ఓ వైసీపీ కార్యకర్త (గతంలో వార్డు వలంటీర్) రాత్రికి రాత్రే రోడ్డుకి అడ్డంగా గోడ నిర్మాణం చేపట్టారు. స్థానికులు ప్రశ్నించగా, దిక్కున్నచోట చెప్పుకోండన్నాడు. ఈ సంఘటన ఆదివారం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వైసీపీ కార్యకర్త నిర్వాహకాన్ని ప్రసారం చేసింది. దీంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆ కార్యకర్తపై మండిపడ్డారు. వెంటనే గోడ తొలగించాలని మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. స్పందించిన వారు సంఘటన స్థలానికి చేరుకుని రహదారికి అడ్డంగా కట్టిన గోడను తొలగించారు. ఆ వైసీపీ కార్యకర్తను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారు. మరోసారి ఇలా చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఆ కార్యకర్తే గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇలా గే గోడ నిర్మించినట్లు సమాచారం. సమస్య ను పరిష్కరించిన మంత్రి ఆనంకి, సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన ఏబీ ఎన్-ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పురుగు మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

సీతారామపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడ మటి రొంపి దొడ్లకి చెందిన ముట్టుకుంద చెన్నమ్మ (75) మనస్తాపం తో ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుం బీకులు తెలిపారు. ఆమె కొంత కాలం గా అనారోగ్యంతో బాధపడు తున్నారు. దీంతో ఇంటి సమీపంలోని పొలం వద్ద పురుగు మందు తాగింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఉదయగిరి ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందినట్లు వారు తెలిపారు.

'మెనోపాజ్'పై అవగాహన పెంచుకోవాలి

● మెనోపాజ్ సొసైటీ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అంజూ సోని

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మెనోపాజ్ సమస్యలపై వైద్యులు ఎప్పటిక ప్పుడు ఆధునిక వైద్య విధానాల మీద అవగాహన పెంచు కోవాలని మెనోపాజ్ సొసైటీ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అంజూ సోని వెల్లడించారు. ఆదివారం నెల్లూరులోని ఓ హోటల్‌లో జరిగిన వైద్యుల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. సాధారణంగా 40, 50 ఏళ్లలో హార్మోన్ల ప్రభావం వల్ల రుతుక్రమం(మెనోపాజ్) ఆగిపోతుందన్నారు. ఆ తర్వాత అనేక మంది మహిళల్లో జీవక్రియ మార్పులు, బరువు పెరగటం, లైంగిక సమస్యలు, మానసిక ఆందోళనలు పెరిగే అవకాశం ఉందన్నారు. మెనోపాజ్ తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలు చాలా మంది వైద్యులకు తెలియదన్నారు. 1995లోనే దేశంలో మెనోపాజ్ సొసైటీని ఏర్పాటు చేసి వైద్యులకు తగిన శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు.



మాట్లాడుతున్న సొసైటీ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అంజూసోని

● జిల్లా కమిటీ ఎంపిక

జిల్లాలో కొత్తగా మెనోపాజ్ సొసైటీ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా డాక్టర్ పల్లం రెడ్డి యశోధర, కార్యదర్శిగా డాక్టర్ ఉషారాణి, నెల్లూరు నగర అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ సుప్రజ, డాక్టర్ లలితా షిర్డీషా ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలను డాక్టర్ అంజూసోని అందచేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ కేన్సర్ ఇన్స్టిట్యూట్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి, పెద్ద సంఖ్యలో గైనకాలజిస్టులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భోజన కార్మికులు

బడ్జెట్ పెంచండి

● మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ భోజన కార్మికులు ఆదివారం నెల్లూరులో ధర్నా చేశారు. గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా కార్యక్రమం సాగింది. ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే విజయమ్మ, జిల్లా కార్యదర్శి షేక్ రెహానాబేగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో, మూడు నెలలుగా ఉన్న బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. బకాయిలు పెరగడం వల్ల కార్మికులపై ఆర్థిక భారం పెరుగుతోం దన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు అన్నపూర్ణమ్మ, సుభాషిణి, సంధ్యారాణి, జ్యోతి, బుజ్జమ్మ, ముంతాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెల్లిని చూసేందుకు వెళుతూ.. తిరిగిరాని లోకాలకు..!

● కంటైనర్‌ను మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి
● మరొకరికి తీవ్ర గాయాలు
● మృతుడు తిరుపతి, క్షతగాత్రుడు ప్రకాశం జిల్లా వాసులు
● ప్రాణం తీసిన అతివేగం

మనుబోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఫోన్ చేసినా స్పందించని చెల్లెలను చూసేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన అన్న రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు, బంధువుల కథనం మేరకు...

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన మద్దిపట్ల రాజేష్‌నాయుడు(34) ఆరేళ్ల క్రితం గూడూరుకు చెందిన ఎస్‌కే.ఆరిఫాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 5 ఏళ్ల కుమార్తె, 3 ఏళ్ల కుమారుడు ఉన్నారు. కొయ్య పని చేసుకుని జీవనం సాగించే రాజేష్‌నాయుడు పనుల కోసం 5 ఏళ్ల క్రితం బండారుపల్లి నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండకు వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బండారుపల్లిలో ఉంటున్న తోడబుట్టిన చెల్లెలకు ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడకపోవడంతో ఆమె వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో చెల్లిని చూసేందుకు ఆదివారం ఉదయం 9 గంటలకు సింగరాయకొండకు చెందిన తన స్నేహితుడు మునిశేఖర్‌తో కలసి మోటార్‌సైకిల్‌పై బండారుపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై కోల్‌కతా నుంచి బెంగళూరుకు వెళుతున్న పార్శిల్ లారీ యాక్సిల్ విరిగిపోవడంతో డ్రైవర్ లారీని హఠాత్తుగా రోడ్డుపైనే నిలిపివేశాడు. దాని వెనుకాలే మోటారుసైకిల్‌పై వేగంగా వస్తున్న రాజేష్ నాయుడు ముందు షడన్‌గా ఆగిన లారీని గుర్తించినా వేగాన్ని అదుపుచేయలేక వెనుక భాగంలో ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పి మోటారు సైకిల్‌తో పాటు రోడ్డుపై పడిన అతని తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతని వెనుక కూర్చుని ఉన్న మునిశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ.శివరాకేష్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అదేవిధంగా రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై వందలకొద్ది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. హైవే పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదస్థలిలోనే మృతి చెందిన రాజేష్, పరిశీలిస్తున్న ఎస్ఐ శివరాకేష్, ఆగిన వాహనాలు

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కాకర్ల ఆర్థిక సాయం

కొండాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడిన గరిమెనపెంట బాధితులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ట్రస్టు తరపున రూ.50వేలు అందజేశారు. ఆదివారం నగదును టీడీపీ నాయకులు వారి స్వగృహాలకు వెళ్లి అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మధు, శ్రీనివాసులు, రమణయ్య, తిరుపాలు పాల్గొన్నారు.



యానకి లక్ష్మీదేవికి నగదు అందచేస్తున్న టీడీపీ నాయకులు

పోలీసు శిక్షణలో పేట ఎస్ఐ ప్రతిభ

ఏఎస్‌పేట, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతి జిల్లా కళ్యాణి డ్యామ్ వద్ద జరిగిన పోలీసు శిక్షణలో ఏఎస్ పేట ఎస్ఐ సైదులు ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా, రాయలసీమ ప్రాంతాలకు చెందిన పలువురు పోలీసు అధికారులకు మాదక ద్రవ్యాల నిరోధకంపై ఇక్కడ శిక్షణ నిర్వహించారు. శిక్షణ అనంతరం జరిగిన రాతపరీక్షలో ఆయన ప్రతిభ చూపి ప్రథమ బహుమతి పొందారు.



సైదులు

పడకేసిన పారిశుధ్యం

- రోడ్లపైనే మురుగునీరు నిల్వ
- దోమలకు ఆవాసాలుగా గుంతలు
- ఫాగింగ్ చేయని గ్రామ కార్యదర్శులు

లింగసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం కొరవడింది. పంచాయతీల్లో నిధులున్నా అధికారులు ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ సమస్యతో రెండు నెలలుగా ప్రజలు జ్వరాలు, జలుబు, దగ్గు, ఇతర చిన్న వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు అంద జేసినా మరలా తిరగబెడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ఆలస్యంగా బ్లీచింగ్ చల్లించి చేతులు దులుపుకుంటున్నారు. దీనికితోడు జంగిల్ తొలగించే చర్యలు తీసుకోవడం లేదు. మురుగు కాలువల్లో లార్వా చనిపోయేందుకు ఎబేట్ చల్లక పోవడం, ఫాగింగ్ చేయించక పోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి.

మరమ్మతుకు నోచుకోని 14ఫాగింగ్ యంత్రాలు

వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని 13గ్రామ సచివాలయాలకు 13, ఎంపీడీఓ కార్యాలయానికి ఒక ఫాగింగ్ యంత్రాలను అందజేశారు. నేడు మొరాయించడతో వాటికి మరమ్మతులు చేపట్టడం లేదు.



మూలనపడ్డ ఫాగింగ్ యంత్రం

సీసీలు ఉన్నా సైడ్ కాలువలు లేవు..

గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించినా సైడు కాలువలు లేక పోవడంతో రోడ్లపైనే నీరు మురుగునీరు నిలుస్తోంది. వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, పెదపవని, లింగసముద్రం, మొగిలిచెర్ల తదితర గ్రామాల్లో రోడ్లపైనే నీరు నిలుస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు చెబుతున్నా, ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు పనులు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.



వీఆర్.కోట అంతర్గత రోడ్డుపై నిలిచిన మురుగు

బాధితులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 16: ప్రమాదాలకు గురై మంచానికే పరిమితమైన, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి గంగిరెడ్డిపల్లిలోని నివాసంలో ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన దేవండ్ల రమణయ్యకు రూ.10వేలు, గుండెజబ్బుతో బాధపడుతున్న చిన్నారికి, దివ్యాంగుడి కుటుంబఅవసరాలకు చెరో రూ.5వేలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.



నగదు అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి

న్యూస్ బాక్స్

పాఠశాలను విలీనం చేయొద్దు

లింగసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెదపవని ముస్లిం కాలనీలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను భోరావు జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని పాఠశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ, గ్రామ ముస్లిం అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఎస్ఎం.బాషాతో పాటు మరికొందరు గ్రామస్థులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1947లో స్థాపించిన ఈ పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఎలా విలీనం చేస్తారని పేర్కొన్నారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

కావలి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు అర్ధరాత్రి కాపుకాచి కర్రలతో దాడి చేశారని వెంగయ్యగారిపాలెం వైసీపీ నాయకుడు మాతిన నాగరాజు ఆదివారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిన్నాయి. పట్టణంలోని సూర్య బార్ క్యాషియర్ నాగరాజు శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన జంపాని ప్రసాద్, మరికొందరు కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు చెరువుకట్ట సమీపంలో ఆదివారం గంగమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న వేదపండితులు, గ్రామస్థులు

కందుకూరు అభివృద్ధిపై సీఎంకు చిత్తశుద్ధి ఉంది

- రూ.50కోట్ల నిధుల మంజూరుపై హర్షం
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు రూ.50కోట్లు నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం పట్టణాన్ని ఎంపిక చేసుకోవడం మనప్రాంత అభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అదేవిధంగా దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని గర్భకండ్రిక భూముల సమస్య పరిష్కారానికి జీఓ విడుదల చేసి శాశ్వత పరిష్కారం చూపిన సీఎం చంద్రబాబునాయుడుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో డంపింగ్ సమస్య లేకుండా ఏరోజుకారోజు చెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినందున ప్రజలు అందుకు సహకరించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, చిలక పాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహిళకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 20మంది పేదలకు వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.19.01 లక్షల చెక్కులను ఎమ్మెల్యే బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

బిట్రగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పాతబిట్రగుంట ద్వారకా నగర్‌లోని షిర్డిశేషసాయి మందిరంలో భక్తుల అవసరార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తునట్లు మందర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం తెలిపారు. ఆదివారం బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయి నామ సంకీర్తన, తీర ప్రాంత భజన బృందాలు పూజలు చేపటారు. దర్శనార్థం భక్తులకు బ్రహ్మానందం, వసుంధర దంపతులు అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 9నుంచి 15 వరకు జరుగనున్నాయని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు దాతల సహకారంతో మందిరంలో నాలుగురోజుల పాటు అన్నసంతర్పణ చేసేందుకు కమిటీ సభ్యులు తీర్మానించినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- రామకృష్ణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఉదయగిరి



ఉదయగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణరావు పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, తగిన ప్రణాళికలతో నీటి అవసరాలను తీర్చుతామన్నారు.

? తాగునీటి సమస్యను ఎలా అధిగమిస్తారు.

! గతేడాది వర్షాలు బాగా కురవడంతో గ్రౌండ్ వాటర్ బాగుంది. నీటి సమస్య తలెత్తిన గ్రామాల పరిస్థితిని ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తాగునీటి సమస్య తీరుస్తాం.

? చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్నారా...

! సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో చేతిపంపుల సామగ్రి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది. మరమ్మతులకు గురైన చేతిపంపులను ఎప్పటికప్పుడు బాగు చేయిస్తున్నాం.

? ఇంటింటికీ కుళాయి మాటేమిటీ..

! గత ప్రభుత్వంలో మంజూరైన జలజీవన్ పనులు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నది. సోమశిల నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసి, ఇంటింటికి కుళాయితో నీరు సరఫరా చేస్తాం.

ధ్యానంతో దీర్ఘకాలిక వ్యాధుల నయం



వింజమూరులో పిరమిడ్ ధ్యానుల ర్యాలీ

వింజమూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేయడం ద్వారా వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చని చిత్తూరు జిల్లా బంగారుపాలెంకి చెందిన పిరమిడ్ మాస్టర్ రోహిణీలక్ష్మి వివరించారు. వింజమూరులోని శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లా డారు. భూమ్మీద అతిపెద్ద పాపం మాంసం తినడమేనని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. మార్చి 9న నంద్యాల జిల్లా డోన్‌లో జరిగే మహాకరుణ శాకాహార ర్యాలీకి హాజరు కావాలని కోరుతూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో శ్రీజ, హేమలత, లక్ష్మి, రవిచంద్ర, జానకిరామిరెడ్డి, హజరత్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నాగారపమ్మకు పొంగళ్లు

సంగం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల లో ఉన్న నాగారపమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మ వారి మూలవిరాట్‌కు క్షీర,పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించారు. భక్తులు పెన్నాఘాట్‌లో స్నానం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు గుర్తించుకోవాలి

- ఆంధ్ర ముస్లిం యోధులు పుస్తకావిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి టౌన్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం రెడ్‌క్రాస్ భవన సమావేశ మందిరంలో రచయిత సయ్యద్ నసీర్‌అహ్మద్ రచించిన భారత స్వాతంత్ర్య ఆంధ్ర ముస్లిం యోధులు అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మాజీ కౌన్సిలర్ మస్తాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భావితరాలకు త్యాగమూర్తుల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రచయిత నసీర్‌అహ్మద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, రచయిత నసీర్‌అహమద్ , తదిరులు

సినిమాల ప్రభావంతో వక్రీకరణ: రచయిత నసీర్

సినిమాల్లో వాస్తవ చరిత్ర వక్రీకరించబడుతుందని దాన్నే నేటితరం నిజం అని నమ్ముతున్నారని పుస్తక రచయిత నసీర్ వాపోయారు. వాస్తవ చరిత్ర తెలుసుకోవాలంటే అప్పటి ప్రముఖ చరిత్రకారులు, రచయితల పుస్తకాలను చదవాలని కోరారు. స్వాతంత్రోద్యమంలో ఆంధ్ర ముస్లింలు అనేకమంది ప్రముఖపాత్ర పోషించి అసువులు బాశారని వారిని స్మరించుకోకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సఫ్దార్ కిర్మాణి, రాజ్‌కుమార్ చౌదరి, తిరివీధి ప్రసాద్, డాక్టర్ బెజవాడ రవికుమార్, జాఫర్‌ఖాన్, శారద పాల్గొన్నారు.

టీడీపీ సభ్యులకు అండగా ఉంటాం

కావలి రూరల్: టీడీపీ కుటుంబసభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం అన్నగారిపాలెం పంచాయతీ కుమ్మరిపాలెం తాతా శివ, పొన్నగంటి వెంకయ్య, శింగిరిగిరిపాలెం కైతుపల్లి నారాయణ, కొనదిన్నె జంపాని పద్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావు పాల్గొన్నారు.

కిక్కిరిసిన చేపల మార్కెట్

బిట్రగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ ప్రచారం కలకలం రేపతుండటంతో ప్రజలు ఆదివారం సెలవుదినం రోజున మటన్, చేపల కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపారు. స్థానికులు ఎక్కువగా మాంసం, చేపలు కొనుగోలు చేసేందుకు రావడంతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. కొనుగోలుదారులు రాకపోవడంతో చికెన్ షాపులు బోసిపోయాయి.



చేపల మార్కెట్‌లో జన సందోహం

నిలిచిన పనులు

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల కమిటీలకు నిధులు మంజూరు అయినా ఇసుక, సిమెంట్ సరఫరా చేయక పోవడంతో స్థానిక వెంగళరావునగర్ శ్రీపొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కల్లయ్య, వైస్ చైర్మన్ సుభాషినిలు తెలిపారు. ఈ విషయంపై పాఠశాల కమిటీ సభ్యులు సమావేశమై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు-నేడు కింద రూ.90లక్షలు మంజూరవగా గదుల నిర్మాణ పనులు పూర్తి చేశామని, గ్రానైట్ వేసేందుకు ఇసుక, సిమ్మెంట్ లేదన్నారు.

మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలి

- వామపక్ష నేతలు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, లక్ష్మీరెడ్డి

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అనంతార్థ అసోసియేషన్ మనీ స్కాం నిర్వాహకులపై చర్యలు తీసుకొని.. నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని వామపక్షాల నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పసుపులేటి పెంచలయ్య, లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం వామపక్షాల నాయకులు సమావేశమై ఈ విషయంపై చర్చించారు. అనేకమంది బాధితులను విచారించగా వారు తమ బాధలు తమతో చెప్పుకున్నారని వారికి న్యాయం జరిగే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మనీ స్కాంలో ఏజంట్లుగా ఉండి దానికి అండగా నిలిచిన ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ స్కాంపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈ స్కాంలో సంబంధం ఉన్న చిన్నస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకుని పైస్థాయి అధికారులను రక్షించే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. అనేక రాష్ట్రాలలో ఈ తరహా నేరాలకు పాల్పడిన వ్యక్తికి కావలిలో పోలీస్‌లు అండగా ఉండటం అత్యంత దారుణం అన్నారు. విచారణ పేరుతో జాప్యం చేయటం.. పోలీస్‌లు పాత్రదారులుగా ఉండటం చూస్తే బాధితులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం ప్రజలలో సన్నగిల్లుతోందన్నారు. సమావేశంలో నాయకులు దమ్ము దర్గాబాబు, కే.నాగరాజు, సీపీఎం, సీపీఐఎంఎల్ నాయకులు కరువది భాస్కర్, మల్లె అంకయ్య, చేవూరు కొండయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

'కామధేను' అభివృద్ధికి కృషి చేస్తా : బొల్లినేని

కొండాపురం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకట రామారావు తెలిపారు. ఉప్పలూరు మాజీ సర్పంచ్ ఓరుగంటి మస్తానయ్య కుమారుడు ధనుంజయ్ గంధపునలుగు వేడుకలో ఆదివారం ఆయన పాల్గొని ఆశీర్వదించి మాట్లాడారు. అప్పటి ఉపరాష్ట్రపతి ఎమ్.వెంకయ్య నాయుడు సహకారంతో దేశంలోనే రెండో పెద్దదైన ఈ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో మామి శ్లపల్లియ ఓం కారం, చెరుకూరు వెంకటాద్రి, మాలకొండారెడ్డి, వల్లూరు వెంకటేశ్వర్లు, పదర్ల తిమోతీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని

సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కొరత

- సచివాలయాలు 13.. ముగ్గురే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు
- ఒకరికి 5.. ఇద్దరికి 4 చొప్పున సచివాలయాల బాధ్యతలు
- వీరికి నాలుగుశాఖల పనులతోపాటు అదనపు పనులు

లింగసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13గ్రామ సచివాలయాల్లో 10సచివాల యాలకు రెగ్యులర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 13సచివాల యాలకు కేవలం ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఎర్రారెడ్డి పాలెం సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంటు కె.స్రవంతికి అదనంగా తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయునిపాలెం, లింగసముద్రం-1, 2 సచివాలయాలు, పెంట్రాల సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంటు ఎం.వెంకటేష్‌కు మొగిలిచెర్ల, వీఆర్.కోట, అన్నెబోయినపల్లి సచివాలయాలు, చినపవని ఇంజనీరింగ్ అసిస్టెంటు నందినికి ముత్యాల పాడు, పెదపవని-1,2 సచివాలయాలకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, నాడు-నేడు పనులతో పాటు అదనంగా సాంకేతికం కాని పనులు కూడా వీరు చేయాల్సి వస్తుంది. వీరికి పని భారంతో పాటు, ప్రజలకు కూడా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కొరతను తీర్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లింగసముద్రం-2 సచివాలయం

బీసీ మహిళ రిజర్వేషన్ ఖరారుతో అయోమయం

- రిజర్వేషన్ మార్పు సరికాదనే భావనలో ఎమ్మెల్యే
- కొలిక్కిరాని ఏఎంసీ చైర్మన్ అభ్యర్థుల ఖరారు

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియామాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆశావహులు కావలి బీసీ మహిళకు రిజర్వేషన్ అయిందన్న ప్రచారంతో నిరాశకు గురిఅవుతున్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీని దగదర్తి మండలంకు చెందిన పమిడి రవికుమార్ చౌదరికి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు పార్టీ అధిష్టానం దృష్టికి కూడా ఆయన పేరును పంపారు. ఎమ్మెల్యే చర్యలతో ఆశావహులు సర్దుకున్నారు. అయితే రాష్ట్రంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయటంతో ఆశావహుల ఆశలపై నీరు చల్లినట్లయ్యింది. ఈ విషయంను పార్టీ అధిష్టానం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లి అవకాశం ఉంటే రిజర్వేషన్ మార్పుపై చర్చించాలని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం బీసీ మహిళకు కావలి చైర్మన్ పదవి ఖరారు అయినా దానిపై టీడీపీ వర్గాలు ఒక నిర్ణయానికి రాలేదు. బీసీ రిజర్వేషన్ తప్పనిసరి అయితే అప్పుడు ఆశావహులు ఎవరున్నారా అనే విషయం స్పష్టతకు రాదు. వాస్తవంగా కావలి నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గంలో మత్స్యకారులు, యాదవులు, గౌడ్‌లు ఎక్కువగా ఉండటంతో బీసీ రిజర్వేషన్ తప్పనిసరి అయితే వారిలో ఏదో ఒక సామాజికవర్గం నుంచి ఆశావహులు బయటకు వచ్చే అవకాశం ఉంది.



కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సత్తెమ్మకు పాలపొంగళ్లు

కలువాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామస్థులు ఆదివారం గ్రామదేవత సత్తెమ్మకు పాలపొంగళ్లు నిర్వహించారు. పాడిపంటలతో గ్రామం కళకళలాడాలని కోరుతూ, ప్రతిఏటా అమ్మవారికి పాల పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీ. తొలుత ప్రతి ఇంటి నుంచి మహిళలు కొత్త గంపల్లో నైవేద్యానికి అవసరమైన సామగ్రి తీసుకుని, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవాచౌదరి దంపతులు, బీజేపీ వెంకటగిరి ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట టీడీపీ నేత గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, కూటమి నాయకులు ఉన్నారు.



పూలతో అందంగా తీర్చిదిద్దిన అమ్మవారి ప్రతిమ

వరి కోతల సమయంలో కాలువల్లో పూడికతీత!



పెనుబల్లి సమీపంలో సదరన్ చానల్‌లో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టులో వరి కోతల సమయంలో రిజర్వాయర్ ప్రధాన కాలువ సదరన్ చానల్‌లో పెనుబల్లి, కాగులపాడు మధ్యలో ఆదివారం పూడికతీత పనులు చేపట్టారు. కాలువలో నిండుగా నీరు ప్రవహిస్తుండగా ఓఅండ్ఎం (ఆపరేషన్ మెయింటినెన్స్) నిధులు నిధులు వినియోగించి మినగల్లు వద్ద నుంచి పెనుబల్లి, కాగులపాడు ప్రాంతాల్లో పూడికతీస్తున్నారు. ఈ సమయంలో పనులు చేపట్టడం వల్ల నిధులు దుర్వినియోగం తప్ప ఎవరికీ ప్రయోజనంలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై పలువురు రైతులు అధికారులను ప్రశ్నించగా నిధులు ఇప్పుడు వచ్చాయని, దీంతో పూడికతీస్తున్నామని చెప్పినట్లు రైతులు తెలిపారు. రైతులు ప్రభుత్వానికి చెల్లించే శిస్తు నుంచే ప్రభుత్వం కాలువల పూడికతీతకు ఓఅండ్ఎం పేరుతో నీటిపారుదలశాఖకు నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులు సకాలంలో వినియోగిస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం కనిగిరి ఆయకట్టు కింద వరికోతలు బుచ్చి మండలంలో మొదలయ్యాయి. రెండు, మూడు రోజుల్లో ముమ్మరం కానున్నాయి. ఈ దశలో పూడికతీతపై చర్చనీయాంశమైంది. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ పెంచలయ్యను వివరణ కోరగా ఓఅండ్ఎం నిధులొచ్చినట్లు చెప్పారు. కానీ ఎక్కడ పనులు చేస్తున్నారోనన్న సమాచారం ఏఈకి తెలుసని చెప్పడం విశేషం.

స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటులో ఉద్రిక్తత

● భారీగా పోలీసు బందోబస్తు



ఆందోళన వ్యక్తం చేస్తున్న పలు పార్టీల నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ములుముడి బస్టాండు సెంటర్‌లో స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటుతో శనివారం అర్ధరాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు సమాచారం తెలుసుకొని ఆ ప్రాంతానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో విశ్వ హిందూ పరిషిత్, బీజేపీ నేతలు, హిందువులు భారీగా ఉన్నారు. విషయం తెలుసుకుని నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు పీ సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది భారీ సంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా స్థానికంగా దుకాణాలు మూయించారు. ఇరువర్గాలకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపారు. ఆదివారం సైతం పోలీసు పికెట్ కొనసాగించారు.

మత కలహాలు సృష్టించే యత్నం

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆజాద్ సెంటర్‌లో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు చేసి మత కలహాలు సృష్టించేలా బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని సీపీఐ నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ ఆరోపించారు. ఆదివారం ములుముడి బస్టాండ్ వద్ద ఆ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సిరాజ్ మాట్లాడుతూ 2008 ఆగస్టు 15న అజాద్ సెంటర్‌లో అమర వీరుల స్మారక స్తూపంతో జాతీయ జెండా ను ఆవిష్కరించామన్నారు. ఇప్పటి వరకు అక్కడ మతాలకు, పార్టీలకు అతీతంగా జాతీయ జెండాను ఎగురవేస్తున్నామని చెప్పారు. కానీ శనివారం అర్ధరాత్రి వివేకానందస్వామి విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. మంత్రి నారాయణ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, టీడీపీ నేత ఖాదర్‌బాషా, మైనార్టీ నేతలు జియా, వాజీద్, మున్వర్, షఫీ, అక్బర్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి తరలిరండి

పొదలకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని నిప్పో ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఈనెల 20వ తేదీ నుంచి జరుగనున్న సప్తమ వర్ష శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావాలని సమరత సేవా ఫౌండేషన్ పొదలకూరు మండల అధ్యక్షుడు లక్కాకుల ఆనందరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20వతేదీ ఉదయం సుప్రభాత సేవ, అదేరోజు రాత్రి 7గంటలకు ఈటీవీ పాడుతాతీయగా లో చిన్నారుల భక్తిగీతాలాపన జరుగుతుందని తెలిపారు. 21న సహస్ర దీపాలంకరణ, అదేరోజు రాత్రి 7గంటలకు బ్రహ్మశ్రీ డాక్టర్ గంగాధరశాస్త్రిచే ప్రవచన, 22న సాయంత్రం 6గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే పుష్పయాగ మహోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

పొదలకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పంచాయతీ బస్టాండు ఆవరణలో జనసేన నాయకులు నారదాసు రవి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలతో అలంకరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, గుమ్మినేని వాణిభవానీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సందీప్, విష్ణు, లక్కాకుల ఆనందరావు, బండి మనోజ్, కొమ్మల ప్రసాద్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నాగమానసాదేవికి విశేష పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం నాగమానసా దేవికి, ఏకాదశ నాగులు, బాలసుబ్రమణ్యేశ్వరస్వామి (పుట్ట)లకు పూజలు జరిగాయి. ఈ పూజలు ప్రతి ఆదివారం జరుగుతాయని అర్చకుడు ఇనమెళ్లూరి వసంతరావుశర్మ తెలిపారు.

ఏప్రిల్ 14న ఎస్టీ వర్గీకరణ భేరి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ వర్గీకరణ భేరి కార్యక్రమాన్ని ఏప్రిల్ 14న నిర్వహిస్తున్నామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు చిన్నపెంచలయ్య తెలిపారు. నగరంలోని గిరిజన భవన్‌లో రాష్ట్రస్థాయి యానాదుల సంక్షేమ సంఘం, యానాది గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ యానాది రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఎస్టీ వర్గీకరణ చేసి, అన్ని విధాలా వెనుకబడిన యానాదులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్రంలో అన్ని జిల్లాల నాయకులు హాజరై యానాదుల సమస్యలపై చర్చించి ఏకగ్రీవంగా పలు తీర్మానాలు చేశారు. నాయకులు చేవూరు సుబ్బారావు, చలంచర్ల పెద్ద బ్రహ్మయ్య, చెంబేటి ఉష, రాపూరు కృష్ణయ్య, తలపల చెంచు మల్లికార్జున, తలపల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, పక్కన వాకర్స్ సంఘం నాయకులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వాకర్స్ అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం చేయాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సూచించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఆది వారం నిర్వహించి వైద్య శిబిరాని కి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఆహార నియమాలు, వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి జీ నారాయణరెడ్డి, కోశాధికారి ప్రసాద్ నాయుడు, ఎలెక్ట్ గవర్నర్ బలరామయ్యనాయుడు, డాక్టర్ నిఖిలారెడ్డి, డాక్టర్ శ్రీదర్‌రెడ్డి పాల్గొన్నారు.

గొలగమూడిలో ఆటో చోరీ

వెంకటాచలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద రెండు రోజులు కిందట ఆటో చోరీకి గురైంది. వెంకటాచలం గ్రామానికి చెందిన మేకల గోవిందు తన కుటుంబంతో కలిసి దైవదర్శనం కోసం గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమానికి వెళ్లారు. ఆశ్రమం వద్ద ఉన్న పార్కింగ్‌లో టోకెన్ తీసుకుని ఏపీ26 టీడీ5378 నెంబరు గల ఆటోను పార్కింగ్ చేసి వెళ్లగా దర్శనం ముగించుకుని వచ్చేలోగా ఆటో చోరీకి గురైంది. చుట్టుపక్కల గాలించినా ఆటో దొరకపోవడంతో ఆదివారం సాయంత్రం వెంకటాచలం పోలీసులకు ఆటో ఓనర్ గోవిందు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

● హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

వెంకటాచలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సారథ్యంలో ఆయన కుమార్తె యిమ్మణ్ణి దీపావెంకట్ నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ట్రస్ట్ ప్రాంగణంలో ఉన్న బ్రిడ్జి స్కూల్ విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు. కాసేపు వారితో కలిసి ముచ్చటించారు. ఈసందర్భంగా చిన్నారి పేర్లు అడిగి తెలుసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. తొలుత రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికా రు. ఈసందర్భంగా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వెంకయ్య నాయుడితో కలిసి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కలిశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ జిల్లా నేతలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, పక్కన గౌరవ అధ్యక్షుడు సోమా భాస్కర్, తదితరులు

పొదలకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం మండల కార్యవర్గాన్ని ఆ సంఘం నాయకులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన మండల పద్మశాలి కమిటీ నూతన ఎన్నికల్లో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు బూదాటి రాధయ్య, జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, కేంద్ర కమిటీ సభ్యుడు రామనాథం రాజశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్‌ల పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలో మండల అధ్యక్షుడుగా చొప్పా వెంకటేశ్వర్లు (చిరు), గౌరవ అధ్యక్షుడుగా సోమా భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ పద్మశాలి సమాజం అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. అనంతరం జాతీయ, రాష్ట్ర నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వూకోటి లక్ష్మీనారాయణ, చింతగింజల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, అందే జగదీష్, బండ్ల పరమేష్, పొదలకూరు మాజీ అధ్యక్షుడు కోనం బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం బాగుంటుంది

● మంత్రి నారాయణ



నూతన పరికరాలతో జిమ్ చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగుంటుందని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం 14వ డివిజన్‌లోని మాగుంట సుబ్బరామి రెడ్డి పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను ఆయన ప్రారంభించారు. 2014లో తాను మంత్రిగా ఉన్నప్పుడు నగరంలో 100 పార్కులను రూపొందించాలని సంకల్పించినట్లు తెలిపారు. వాటిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అన్నీ పార్కుల్లో జిమ్ పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. హడ్కో నిధులు రూ.165 కోట్లతో యూజీడీ, తాగునీటి పనులు పూర్తి చేసి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మూడు నెలల్లో నగరంలో పూర్తి స్థాయిలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీవస్త్రాలు, నూలుమాలలు, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు పొణక కనకమ్మ, గాంధీజీ జీవిత విశేషాలను ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'గాయం, కుట్లు లేకుండా గుండె ఆపరేషన్'

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై అక్సిమేడ్ హస్పిటల్‌లో దాదాపు 20 ఏళ్లకుపై గాయం, కుట్లు లేకుండా గుండె శస్త్రచికిత్స చేస్తున్నామని ఆ ఆసుపత్రి డాక్టర్ అయాజ్ అక్బర్ తెలిపారు. ఆదివారం అక్సిమేడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నగరంలోని హజీరా ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. గుండెనొప్పి, ఆయాసం లేని వారికి నొప్పి, గాయం లేకుండా ఈఈసీపీ విధానంలో ప్రత్యేకమైన చికిత్స చేస్తున్నామన్నారు. హజీరా ఆసుపత్రి ప్రెసిడెంట్ ఎం షహబుద్దీన్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో పదేళ్లుగా వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సమఅక్బర్, సయ్యద్ నవీన్ అహ్మద్, హమయాన్, ఫిర్దోస్ ఖాన్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

18 గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణం

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ మం డలంలోని 18 గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు, ఇతర నిర్మాణాలు శరవేగం గా జరుగుతున్నాయని, ఇంతలా ఒకే సారి అన్నీ గ్రామాల్లో పనులు మొద లవడం ఇదే తొలిసారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపా రు. దేవరపాళెంలో రూ.25లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థా పన చేశారు. ప్రజల సమస్యలు ఒక్కోటిగా పరి ష్కరిస్తున్నామన్నారు. అనంతరం మండలంలో ని పల్లెపాళేనికి చెందిన తాండ్ర శివ బృందాన్ని నెల్లూరులోని తన కార్యాలయంలో కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. 30వ డివిజన్ షేక్ హమీద్, ఖాదర్‌బా షా మిత్రబృందాన్ని కూడా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఎంపీపీ విజయకుమార్, నాయకులు గున్నయ్య, రఘు పాల్గొన్నారు.

సాహిత్యంతోనే స్త్రీలకు సమానత్వం : నెరసం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సాహిత్యం ద్వారా స్త్రీలు స మానత్వం సాధించేలా కవులు, రచయిత లు, తమ రచనలు కొనసాగించాలని నెల్లూ రు రచయితల సంఘం(నెరసం) ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ పిలుపునిచ్చా రు. ఆదివారం కర్నూలులో జరిగిన నవ్యాం ధ్ర రచయితల సంఘం వార్షికోత్సవంలో ఆమె ప్రసంగించారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక



మండల కార్యవర్గ సభ్యులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నాయకులు సురేంద్రరెడ్డి, తదితరులు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరికలో బీజేపీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు శ్రీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పీ.సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, చిరమణ జనార్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దువ్వూరు పరుశురాం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న బీజేపీకి ఆదరణ పెరగడంతో దేశమంతా కాషాయమయమైందన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్.గాంధీ, సతీష్‌రెడ్డి, ఎన్.శివప్రసాద్, వి.ప్రసాద్, డి.రాంమోహన్‌రెడ్డి, కె.అవినాష్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసులు, జి.పరం. పి.సుదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల హేతుబద్ధీకరణ వద్దు : బీటీఏ



డిప్యూటీ ఈవోకు క్యాలెండర్, వినతిపత్రం అందచేస్తున్న బీటీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న పాఠశాలల హేతుబద్ధీకరణను ఉపసంహరించుకోవాలని బీటీఏ నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో డిప్యూటీ ఈవో వెంకటేశ్వర నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం జీవో నెం 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరితే హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడం సరికాదన్నారు. దీనిపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. రోల్‌తో సంబంధం లేకుండా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డీ.మాల్యాద్రి, అసోసియేట్ అధ్యక్షుడు పీ.వేణుగోపాల్, కార్యదర్శి బీ భాస్కరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్ దత్తాత్రేయకు జనసేన సత్కారం



గవర్నర్ దత్తాత్రేయను సత్కరిస్తున్న మల్లికార్జున యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పర్యటనకు వచ్చిన హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆదివారం జనసేన నాయకులు కలిసి సత్కరించారు. పప్పులవీధిలోని యడ్లపల్లి వెంకటేశ్వరరావు మున్సిపల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణకు విచ్చేసిన దత్తాత్రేయను జనసేన నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ కలిసి సన్మానించారు.

వృద్ధులకు వినికిడి యంత్రాలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు వినికిడి యంత్రాలను సియల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందచేశారు. డాక్టర్ సుమన్ కృష్ణారెడ్డి, డాక్టర్ రాధాకృష్ణ వృద్ధులను పరీక్షించి అవసరమైన వారికి వినికిడి యంత్రాలను అమర్చారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు మాట్లాడుతూ ఆశ్రమం స్థాపించి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన గిరిధర్



మంత్రి లోకేష్‌తో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలిశారు. 34 రోజులపాటు సుదీర్ఘంగా సాగుతున్న గడప గడప కార్యక్రమం, నారా లోకేష్ ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు అందించిన వైద్యం వంటి విషయాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చాయి. కాగా, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి లోకేష్‌ను సత్కరించారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుమన్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీవోఈఏ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కే సుమన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంలోని ఏపీఆర్ఎస్ఏ భవనంలో ఆ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మెప్మా, సెర్ప్ ఉద్యోగులకు గత ప్రభుత్వం హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆప్కాస్ రద్దు ప్రకటనను ఖండిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు జీ సంపత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అక్కన మహిదర్‌బాబు, జాయింట్ సెక్రటరీ సిద్ధవరపు విజయ్‌కుమార్, కార్యదర్శి పేట రాజేష్, రాష్ట్ర కోశాధికారి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మర్ నాగరాజుకు సన్మానం



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నెల్లూరు పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్‌కు చెందిన నాగరా జు ద్వితీయ స్థానం సాధించడంతో ఆదివారం పెన్నానది ఒడ్డున ఘన స్వాగతం పలి కారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 51 సంవత్సరాల గ్రూపులో కృష్ణానదిని ఈది ద్వితీయ స్థా నం సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమం లో పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్య క్షుడు మోపూరు పెంచలయ్య, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి మునగా నాగేశ్వర రావు, హైటెక్ ఫార్మా అధినేత రమణారెడ్డి, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రాజకీయ శక్తి



మాట్లాడుతున్న గ్రంథ రచయిత సతీష్‌చందర్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : దళిత బహుజనులు ఐక్యంగా నిలబడితే రాజకీయ శక్తిగా ఎదుగుతారని సీ ఫర్ క్యాస్ట్, బీ ఫర్ బ్యాలెట్ గ్రంథ రచయిత సతీష్‌చందర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో భారతదేశంలో రిజర్వేషన్- రాజకీయాలు అనే అంశంపై జరిగిన వర్క్‌షాపునకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. బ్లూవింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతదేశ రాజకీయ విధానంపై పలు అంశాలు వివరించారు. అన్ని కులాల్లో విభజనలు చేసి వారి మధ్య విద్వేషాలను ప్రభుత్వాలు రెచ్చగొడు తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లూవింగ్స్ ఫౌండేషన్ చీఫ్ ఆర్గనైజర్ డాక్టర్ శివరామకృష్ణారావు, ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు పద్మజ, తుపాకుల మునెమ్మ, బహుజన టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు నూకలపాటి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పోలీస్ క్వార్టర్స్!

పొదలకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలో దశాబ్దాల కిందట పోలీస్ సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి నివాసయోగ్యంగా మారాయి. పోలీస్ క్వార్టర్స్ సక్రమంగా ఉంటే పొదలకూరు స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది ఆ క్వార్టర్స్‌లో నివాసం ఉండి ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండడానికి అవకాశం ఉంటుంది. క్వార్టర్స్ అందుబాటు లేకపోవడంతో సిబ్బంది బయట అద్దె భవనాల్లో నివాసం ఉంటున్నారు. అంతే కాకుండా పొదలకూరు చుట్టుపక్కల రాపూరు, సంగం, మనుబోలు, కలువాయి, చేజర్ల, తదితర మండలాలన్నింటికీ పొదలకూరు కేంద్ర బిందువుగా ఉంది. దీంతో చుట్టుపక్కల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు పొదలకూరులో నివాసం ఉంటూ రోజూ విధులకు హాజరవుతుంటారు. దీంతో ఒక్క ఇళ్లకు అద్దెలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ఎంతో విలువైన పోలీస్ క్వార్టర్స్ స్థలం పట్టణం నడిబొడ్డున ఉన్నందున మళ్లీ కొత్త పోలీసు క్వార్టర్స్ నిర్మిస్తే సిబ్బందికి బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇదిలాఉండగా నిరుపయోగంగా ఉన్న విలువ ఈ స్థలం కబ్జాకు కొంతమంది ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొందరు అనధికారికంగా పూలమొక్కలు అక్కడ పెట్టుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారు.



● బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్





● వెలవెలబోయిన షాపులు ● మటన్, చేపల మార్కెట్ల వద్ద రద్దీ

చికెన్.. తగ్గెన్!

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఆదివారం.. చికెన్ షాపుల్లో అమ్మకాలు పెరిగేవి. చాలాచోట్ల గుంపులుగా నిలబడాల్సిన పరిస్థితి. అలాంటిది ఈ ఆదివారం చికెన్‌షాపులన్నీ ఖాళీగా కనిపించాయి. అక్కడక్కడా ఒకరిద్దరు ఉన్నారంతే. కొనుగోలుదారులే లేకుండా పోయారు. బర్డ్ ఫ్లూ ఆందోళనతో జనం చికెన్ కొనుగోలుకు ఆసక్తి చూపలేదు. ధరలు తగ్గినా.. కొనుగోళ్లపై ప్రభావం చూపలేదు. తిరుపతి నగరంలోని లీలామహల్ సర్కిల్, తిలక్ రోడ్డు, మంగళం రోడ్డు, కొర్లగుంట రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం పూట సందడిగా కనిపించే చికెన్ దుకాణాలన్నీ వెలవెలపోయాయి. అదే సమయంలో చేపల దుకాణాల వద్ద జనం కిక్కిరిశారు. లీలామహల్ నుంచి దేవేంద్ర థియేటర్‌కు వెళ్లే దారిలో చేపల మార్కెట్ వద్ద ప్రతి ఆదివారం జనం రద్దీ ఉంటుంది. ఈ ఆదివారం మరింతగా కొనుగోలుదారులు పెరిగారు. చికెన్ వద్దనుకున్న వారిలో అత్యధికులు చేపల వైపు మొగ్గు చూపారు. ఉదయం 5 గంటల నుంచే వందలాది మంది దుకాణాల వద్దకు చేరుకున్నారు. కొన్ని రకాల చేపల ధరలు అమాంతంగా పెంచినా.. కొనుగోళ్లు తగ్గలేదు. చేపల మార్కెట్ వద్ద ఒకదశలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, నగరంలోని పలుచోట్ల మధ్యాహ్నం 12 గంటలకే చేపలు అయిపోయాయి. ఇక, గతంకన్నా ఈ ఆదివారం మటన్ కొనుగోళ్లు పెరిగాయి. బర్డ్ ఫ్లూ ప్రభావాన్ని పసిగట్టిన కొందరు చికెన్ దుకాణదారులు.. ఈ ఆదివారం మటన్ విక్రయాలు ప్రారంభించడం గమనార్హం. మటన్ ధరలూ పెరిగాయి. మధ్యాహ్నానికి చాలా మాంసం దుకాణాలు కూడా ఖాళీ అయ్యాయి.





- 10 రోజుల కిందటి వరకు కిలో చికెన్ బ్రాయిలర్ రూ.280 వరకు ధర పలికింది. ఇప్పుడు చాలా చోట్ల స్కిన్ రూ.90, స్కిన్‌లెస్ రూ.110 వరకు.. ఇంకొందరు రూ.160 వరకూ ధరలు పెట్టారు. ఇలా ఒక్కో ధరలున్నాయి. తిరుపతిలో దాదాపు 230 చికెన్ షాపులున్నాయి. ఆదివారం గరిష్ఠంగా రూ.28 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వ్యాపారం జరిగేది. ప్రస్తుతం రూ.లక్ష జరగడం కష్టంగా ఉందని చికెన్ దుకాణాల సంఘం నేతలు అంటున్నారు.
- సాధారణ రోజుల్లో కిలో చేపలను రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.560 వరకు విక్రయించేవారు. ఈ ఆదివారం డిమాండు పెరగడంతో సగటున కిలోపై రూ.వంద పెరిగింది.
- కిలో మాంసంపై రూ.50 నుంచి రూ.80 వరకు ధర పెంచారు. కిలో రూ.930 నుంచి రూ.వెయ్యి వంతున అమ్మారు.





సినీనటుడు మంచు మనోజ్ - పశువులను నిలువరిస్తున్న యువకులు - గాయపడిన వారికి చికిత్స

పట్టుకో.. పట్టుకో

ఉత్సాహం ఉరకలేసిన జల్లికట్టు

పశువుల నిలువరింతలో పలువురికి గాయాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు మొదలై.. సాయంత్రం వరకు సాగింది.ఈ జల్లికట్టులో పాల్గొనేందుకు పరిసర ప్రాంతాల రైతులు తమ ఎద్దులను తీసుకొచ్చారు. వాటికి ఫొటోలు, టీడీపీ, వైసీపీ, జనసేన జెండాలను కట్టి వదిలారు. వేలాదిగా తరలి వచ్చిన యువకులు అల్లె అవతల నిలబడి కోడెగిత్తలను నిలువరించి.. వాటి కొమ్ములకున్న చెక్క పలకలను సొంతం చేసుకొనేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు యువకుల మధ్య కొన్నిసార్లు ఘర్షణ జరిగింది.పశువుల నిలువరింతలో కిందపడటంతో 40 మందికి పైగా గాయపడ్డారు. చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. క్షతగాత్రులకు అక్కడే ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్స కేంద్రంలో వైద్యసేవలందించారు. తీవ్ర గాయాలైన వారిని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు డీజే మ్యూజిక్‌తో ర్యాలీగా తమ ఎద్దులను జల్లికట్టు ప్రదేశానికి తీసుకొచ్చారు. జల్లికట్టు వీక్షణకు వచ్చిన సినీనటుడు మంచు మనోజ్‌కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వచ్చిన జనానికి గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

● శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలపై హోం మంత్రి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసినట్టు హోంమంత్రి అనిత తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో ఆదివారం ఆమె ఉత్సవాల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు పనిచేయాలన్నారు. స్వామి, అమ్మవార్లకు ఈనెల 25న సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం ఉందన్నారు. వీఐపీలకు ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంతో పాటు భక్తుల కోసం వైద్యబృందాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఈ ఏడాది భక్తులందరికీ లడ్డూ ప్రసాదంతో పాటు నీళ్ల బాటిళ్లను ఉచితంగా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. స్థానికులకు ప్రత్యేక ఉచిత దర్శనం కల్పిస్తున్నామన్నారు. ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అంతకుముందు స్వామి అమ్మవార్లను హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధిలో మంత్రిని శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారమూ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొన్ని అనివార్య కారణాలతో ఈ వారం రద్దు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఫిర్యాదులు, వినతులు ఇవ్వదలచిన వారు నేరుగా సమీప పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని కోరారు.



ఐటీసీఎక్స్‌కు సిద్ధమైన వేదిక

అంతర్జాతీయ ఆలయాల సదస్సుకు

తిరుపతి వేదిక

నేటినుంచి మూడు రోజుల పాటు ఐటీసీఎక్స్

శ్రీవారి ఆలయంపైనా చర్చాగోష్ఠి

సీఎం చంద్రబాబు సహా గోవా, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల రాక

తిరుపతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దేవాలయాల సదస్సుకు తిరుపతి వేదిక కానుంది. ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025 (ఐటీసీఎక్స్) పేరిట టెంపుల్ కనెక్ట్ సంస్థ మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్లో మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభ సభ జరగనుంది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సీఆర్ ముకుంద్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సమావేశాలు జరుగుతాయి. తిరుమల శ్రీవారి ఆలయ పాలనపరమైన అంశాలపైనా సదస్సులో చర్చించనున్నారు. దేవాలయ పరిపాలన, నిర్వహణపై జరిగే ఐటీసీఎక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి ఆదివారం మీడియాకు చెప్పారు. ఎక్స్‌పో చైర్మన్, మహారాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ.. దేవాలయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేయడం, భక్తులకు సౌలభ్యాన్ని పెంచడం తదితరాలపై ప్రధానంగా చర్చ ఉంటుందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, తొక్కిసలాట జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసాదాల నాణ్యతకు అధునాత ల్యాబ్‌లు, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ పద్ధతులపై మాస్టర్ క్లాస్‌లు ఉంటాయన్నారు. ఆలయ ట్రస్టుల ద్వారా విద్య, వైద్యం, ధార్మిక సేవాకార్యక్రమాల నిర్వహణపైనా చర్చ జరుగుతుందన్నారు. 2023లో వారణాసిలో ఐటీసీఎక్స్ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో అంత్యోదయ ప్రతిష్ఠాన్ చైర్‌పర్సన్ నీతాలాడ్ పాల్గొన్నారు.

ప్రధాన చర్చలివే

ప్రధానంగా రోజుకో అంశంపై చర్చించనున్నారు. ఆలయ విద్యపై జరగనున్న ప్యానెల్ చర్చలో షిర్డీ మాజీ చైర్మన్ డాక్టర్ సురేష్ హవారే, వెలింగ్కర్ ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ సలుంఖే ప్రధానవక్తలుగా పాల్గొంటారు. 'దేవాలయాలకు నెట్‌వర్కింగ్ శక్తి' అంశంపై గోవా ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే, మహారాష్ట్ర అష్ట వినాయ దేవాలయాల ట్రస్టీలు ప్యానెల్ చర్చలో ఉంటారు. దేవాలయాల చుట్టూ ఉన్న చట్టపరమైన సమస్యలపై న్యాయవాది విష్ణుజైన్ మాట్లాడతారు.

ముగ్గురు సీఎంల రాకతో

పటిష్ఠ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: తిరుపతికి సోమవారం ఏపీ, గోవా, మహారాష్ట్ర సీఎంలు చంద్రబాబు, ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడ్నవీస్, పలువురు వీవీఐపీలు రానున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరిలో గోవా, మహారాష్ట్ర సీఎంలు తిరుమలకూ వెళ్లనున్నారు. దీంతో తిరుమలలోనూ భద్రతపై దృష్టి పెట్టారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నుంచి అడ్వాన్స్‌డ్ లైజన్ సెక్యూరిటీ నిర్వహించారు. సదస్సు జరిగే ఆశ కన్వెన్షన్ సెంటరు వద్ద డీఐజీ షిమోసీ, ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 70 మంది ఎస్‌ఐలు, మరో 800 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే బాంబు, డాగ్ స్క్వాడ్లు ఆశ కన్వెన్షన్ సెంటరులో తనిఖీలు చేశారు. ఎస్పీ, జేసీ శుభం బన్సల్, కమిషనరు మౌర్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. తిరుపతిలోని వివిధ విద్యాసంస్థలు, హోటళ్లకు ఇటీవల బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

సీఎంల పర్యటన ఇలా..

- ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 గంటలకు ఆశ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని సాయంత్రం 6.15 గంటల వరకు ఉంటారు.
- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోమవారం ఉదయం 8.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. 3.10 గంటలకు బయలుదేరి తిరుపతిలో సదస్సుకు వస్తారు. ఈ కార్యక్రమం చూసుకుని రాత్రి ఏడు గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.
- గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మధ్యాహ్నం 12.05 గంటలకు విమానాశ్రయానికి.. 1.30 గంటలకు తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 4 గంటలకు తిరుపతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. 7.50 గంటలకు విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు వెళతారు.



కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు, బందోబస్తుపై చర్చిస్తున్న ఎస్పీ, జేసీ, కమిషనర్

జిల్లాలో

కార్డన్ సెర్చ్



పాకాలలో కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

● 10 పోలీసు స్టేషన్ల పరిధిలో 636 వాహనాల తనిఖీ.. 95 సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పది పోలీసు స్టేషన్ల పరిధిలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాకాల, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, కోట, సూళ్లూరుపేట, నాగలాపురం, పుత్తూరు, అలిపిరి స్టేషన్ల పరిధిలో తెల్లవారు జామున 5 గంటల నుంచి ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది కలసి శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, విల్లాల్లో తనిఖీలు చేపట్టారు. అన్ని స్టేషన్ల పరిధిలో 636 వాహనాలు తనిఖీ చేశారు. ఎలాంటి రికార్డులు, లైసెన్సులు, వివిధ ధృవీకరణ పత్రాలు లేని 86 ద్విచక్ర వాహనాలు, ఏడు ఆటోలు, రెండు కార్లు సీజ్ చేశారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట కార్డన్ సెర్చ్ చేస్తుంటామని ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు చెప్పారు. అనుమానితులు ఎవరైనా సంచరిస్తుంటే సమీప స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

9 నుంచి

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9 నుంచి 13వ తేది వరకు జరుగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజున సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రెండవరోజు రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడుసార్లు విహరిస్తారు. మూడవ రోజు మలయప్పస్వామి మూడుసార్లు, నాలుగో రోజు ఐదుసార్లు, చివరిరోజు ఏడు సార్లు తెప్పపై పుష్కరిణిలో విహరించి భక్తులను కటాక్షిస్తారు. ఈ సందర్భంగా మార్చి 9, 10 తేదీల్లో సహస్ర దీపాలంకార సేవ, 11, 12, 13 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సమస్యల పరిష్కారం కోసమే వార్డుబాట



సూళ్లూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార కోసమే వార్డుబాట కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలోని 8వ వార్డులో వార్డుబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సూళ్లూరులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నుంచి వాటంబేడు రోడ్డు వరకు పర్యటించి ప్రజ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆమె స్పందిస్తూ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, కౌన్సిలర్ చెంగమ్మ, సురేష్‌నాయుడు, అలవల శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు పోస్టుమార్టం

కుటుంబసభ్యులకు మృతదేహాల అప్పగింత

పెళ్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం దొడ్లవారి మిట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన మాధవకృష్ణ(48), సరిత సుమంగళి(43) దంపతులు మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం మధ్యాహ్నం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. కుటుంబసభ్యులకు అప్పగించడంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో స్వస్థలానికి తీసుకువెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయకుల మౌఖిక ఆదేశాలు పాటిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పవు: నేదురుమల్లి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నాయకుల మౌఖిక ఆదేశాలు పాటిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పవని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 21న వైసీపీ నాయకుడు పేచిరాజ్‌ను అక్రమంగా అరెస్టు చేసిన వ్యవహారంలో కోర్టును ఆశ్రయించగా పోలీస్‌స్టేషన్ సీసీ ఫుటేజీలు, సంబంధిత అధికారుల కాల్ రికార్డులను అందించాలని కోర్టు కోరిందన్నారు. ఇటీవల నగర వనం ప్రారంభోత్సవంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి పేరు శిలాఫలకంలో రాయలేదని, ఈ విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, శాతరాశి బాలయ్య, వహిదా, సుజాత, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నెల్లూరు జిల్లా జూనియర్ జట్టును ఎంపిక చేసినట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ, పీడీ శ్రీరేష్ తెలిపారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



దివ్యాంగులకు కూరగాయాలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, ఆనంద్, కోటేశ్వరరావు, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ఇబ్రహీం, రజనీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న సింహపురిరెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజేంద్రరెడ్డి, జైపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కార్ల రిపేరింగ్ షెడ్డులో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. షెడ్డులో ఉన్న స్పేర్‌పార్ట్స్ కాలిపోవడంతో రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు శివకుమార్‌రెడ్డి తెలిపారు.



మంటలను అందుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆడదామంటే అనువైన చోటేదీ?

- క్రీడా మైదానాల్లో వసతులు కరువు
- సాధన లేక పతకాలకు దూరమవుతున్న విద్యార్థులు



అధ్వానంగా ఉన్న చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ఎంతో అవసరం. మానసిక ఒత్తిడిని అధిగమించి చదువుల్లో రాణించి, క్రీడల్లో విజయం సాధించాలంటే సాధన ఎంతో ముఖ్యం. ఇందుకు తగిన వసతులు, సౌకర్యాలు ఉంటేనే విద్యార్థులు వారికి ఆసక్తి వున్న క్రీడల్లో సాధన చేసి పోటీల్లో రాణిస్తారు. చిల్లకూరు మండలంలో వివిధ క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. రాష్ట్ర జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ముఖ్యంగా నెలబల్లిరెట్టపల్లి, పారిచెర్లవారిపాళెం, చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ చూపుతున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో పతకాలు

నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో అండర్-14 విభాగంలో బాలికలు ఐదుగురు, బాలురు ఇద్దరు, అండర్ -17 విభాగంలో ఇద్దరు బాలురు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా నేపాల్ జరిగిన అంతర్జాతీయ అండర్-17 బాలుర విభాగంలో ఓ విద్యార్థి పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. రాష్ట్రస్థాయి జంప్‌రోప్‌కు అండర్-14 విభాగంలో ఐదుగురు బాలికలు, ఆరుగురు బాలురు, అండర్-17 విభాగంలో ఇద్దరు బాలురు పాల్గొన్నారు. జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఇద్దరు బాలికలు పాల్గొన్నారు. పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఇద్దరు చొప్పున బాల, బాలికలు ఎంపికయ్యాయి. జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలకు నలుగురు బాలికలు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి జావెలిన్‌త్రో, షాట్‌ఫుట్ పోటీలకు అండర్-14 విభాగంలో ఇద్దరు బాలికలు, అండర్-17 విభాగం నుంచి ఒక విద్యార్థిని ఎంపికయ్యారు. చిల్లకూరు ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్ -14 విభాగంలో బాల, బాలికలు ఒక్కొక్కరు, అండర్ -17 విభాగంలో ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. అలాగే బాల్‌బ్యాండ్మింటన్ పోటీలకు అండర్-14 విభాగంలో ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు ఎంపికయ్యారు. వాలీబాల్ పోటీలకు అండర్-14, అండర్-17 నుంచి బాల, బాలికలు ఒక్కొక్కరు ఎంపికయ్యారు. త్రోబాల్ పోటీలకు అండర్-14 నుంచి ఒక విద్యార్థిని, అండర్-17 నుంచి ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు.

అభివృద్ధికి నోచుకోని క్రీడా మైదానాలు

మండలంలోని పలు పాఠశాలల క్రీడా మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో సాధన లేక ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎంతో మంది విజయాలకు దూరమవుతున్నారు. ఎంతో అనుభవం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. అరకొర వసతులతో అందుబాటులో ఉన్న క్రీడా మైదానాల్లోనే సాధన చేస్తూ విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ కనబస్తున్నారు. చిల్లకూరు, నెలబల్లిరెట్టపల్లి, పారిచెర్లవారిపాళెం, కడివేడు, వరగలి తదితర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చిల్లకూరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పదేళ్ల క్రితం అరకొరగా అభివృద్ధి పరిచారు. 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఆయా క్రీడల్లో సాధన చేయడానికి అవస్థలు పడుతున్నారు. నెలబల్లిరెట్టపల్లి ఉన్నత పాఠశాలలో 100 మీటర్స్, 200 మీటర్స్ రన్నింగ్ ట్రాక్‌లు, వాలీబాల్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు లేవు. పారిచెర్లవారిపాళెంలోని క్రీడామైదానంలో అరకొర వసతులు ఉండగా, కడివేడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అసలు క్రీడా మైదానమే లేదు. ఆయా పాఠశాలల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నా సరైన సాధన లేకపోవడంతో క్రీడల్లో రాణించలేకపోతువున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా మైదానాల అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులు నైపుణ్యం మెరుగుపరుచుకుని విజయాలకు చేరువయ్యేలా కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



చిల్లకూరు ఉన్నత పాఠశాలలో గడ్డితో మూసుకుపోయిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్

మంచి అలవాట్లతో గుండె జబ్బులు దూరం



గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు

గూడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంచి అలవాట్లు పాటిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చునని కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు సహకారంతో గుండె జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న కారణంగా గుండె జబ్బుల భారిన పడుతున్నారన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకునేందుకు ప్రతిరోజూ వాకింగ్ చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గుండెనొప్పి వచ్చినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్, డాక్టర్ రమణయ్య, డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ ప్రకాష్, నిమ్మకాయల రవి, శర్మ, సురేష్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, రమణయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషనల్ మేనేజిమెంట్ అండ్ ట్రైనింగ్(సైమాట్) అధికారి మస్తానయ్య అన్నారు. నాయుడుపేట మండలం పుదూరులోని బాలికల గురుకులంలో ఆదివారం నాయుడుపేట, గూడూరు డివిజన్లలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, పర్నిచర్, డిజిటల్ ల్యాబ్‌లు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శివశంకర్, అసిస్టెంట్ ఏఎంవో మధు, డిప్యూటీ డీఎంవో సన్నత్, ఎంఈవో మునిరత్నం, ప్రిన్సిపాల్ రూత్‌రమోలా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మస్తానయ్య

నిండలిలో బెల్టుషాపు తొలగించాలి



నిండలి సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామంలో ఏర్పాటు చేసిన బెల్టుషాపును తొలగించాలని స్థానికులు ఆదివారం సచివాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహించడం వల్ల సాయంత్రం పూట స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెల్టుషాపును తొలగించాలని సంబంధించిన అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రాజు, వెంకటయ్య, మహిళలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని నాగరాజుపురానికి చెందిన చంద్రయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.43,727 చెక్కును ఎమ్మెల్యే విజయశ్రీ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు రమేష్, కిషోర్, సుధాకర్‌రెడ్డి, వెంకటస్వామి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని పండితులు చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

21న గూడూరులో జాబ్‌మేళా

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్ డబ్ల్యూ కళాశాలలో ఈనెల 21వ తేదీన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు.

పారిశుధ్య కార్మికులకు ఆహారం పంపిణీ

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు స్వామి వివేకానంద యువసైన్యం వ్యవస్థాపకుడు ఏపీపీ ప్రకృతికుమార్ ఆహార పొట్లాలు ఆదివారం అందజేశారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నీటి నమూనాల సేకరణ

కోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, కోట ప్రాంతాల్లో ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి నమూనాలను సేకరించారు. కోట, చిట్టమూరు మండలాల ఏఈలు అరవింద్, మహేష్ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంక్‌లను శుభ్రపరచి క్లోరినేషన్ చేశారు. చేతిపంపులు, తాగునీటి ట్యాంక్‌ల నుంచి శ్యాంపిల్స్ సేకరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మునిరత్నంనగర్‌కు చెందిన పోలమ్మ(57) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం పోలమ్మ ఇంటి ఆవరణలో ఉన్న పురుగుల మందుతాగి తీవ్ర అస్వస్తతకు గురికావడంతో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.







మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం, సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల - నాయుడుపేటలో ప్రజలతో కరచాలనం

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

నాయుడుపేట/టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఘన స్వాగతం పలికారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరయ్యేందుకు రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో వెంకటాచలం వెళ్తున్న మంత్రికి నాయుడుపేట - విన్నమాల రింగ్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కొంతసేపు ఆగిన లోకేశ్‌కు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, పార్థసారధి, మధురెడ్డి, విజయకుమార్ నాయుడు, నాగేంద్రరెడ్డి, సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, సెల్వం, పళణి, ఆకుతోట రమేష్, చంద్రారెడ్డి, జనసేన నాయకులు ప్రవీణ్‌కుమార్, సుబ్బారావు, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరయ్యేందుకు విచ్చేసిన లోకేశ్‌కు ఎమ్మెల్యే పాశం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

డక్కిలి: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రేణిగుంట విమానాశ్రంలో మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, డక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజ చేస్తున్న చిదానంద స్వామి

నాయుడుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పాతబ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. వెంకటగిరి రాజాల కాలంలో నిర్మించిన కాశీవిశ్వేశ్వరాలయంలోని ధ్వజస్తంభం ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతింది. స్థానిక భక్తులు విరాళాలతో నూతనంగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. నాగశక్తి పీఠానికి చెందినచిదానందస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కరింబాయి హరి దంపతులు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రవికృష్ణ, యుగంధర్, పాజర్ల లోకనాథం, అంజయ్య, సుబ్రహ్మణ్యం, సునీల్ తదితరులు ఉన్నారు. ఉభయకర్తగా రాజేష్ మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



కార్డన్‌సర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు చేపడుతామని డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. ఆదివారం స్థానిక గాంధీనగర్ ప్రాంతంలోని దండోరా కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాలను అదుపు చేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో కార్డన్ సెర్చ్

కోట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురం, కోట బజారుసెంటర్‌లో ఆదివారం వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా తిరుగుతున్న 8 మోటారు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో కోట, చిట్టమూరు ఎస్ఐలు పవన్‌కుమార్, చినబలరామయ్య, ఏఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల వద్ద సీఐ రమణ ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 25 మోటర్ సైకిళ్లు, 3 ఆటోలు, ఒక కారును సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, భవాని, గోపి, శవశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాసేలా కేంద్ర బడ్జెట్

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఈనెల 1వ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు కొమ్ముకాసేలా ఉందేకానీ పేదలకు ఉపయోగపడేలా లేదని వామపక్ష నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మన రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 20వ తేదీన స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, వెంకట్రామిరెడ్డి, శివకుమార్, కాలేషా, రమణయ్య, సురేష్, ప్రసాద్, శంకరయ్య, మణి, చంద్రయ్య, శ్రీనివాసులు, శశికుమార్, రమేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

డక్కిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లగుంట గ్రామం వద్ద ఆదివారం ఎస్ఐ శివశంకర్ వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో ద్విచక్ర వాహన చోదకులే ఎక్కువగా ఉన్నారని చెప్పారు.



హెల్మెట్‌పై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్